# చిక్కుప్రశ్న

నిరంజనం ఎక్కిన సిటీ బస్సు బయలుదేరినట్టే ఆశ పెట్టి టీవీ టవర్‌కి కొంచెం ముందుగా మూడు రోడ్ల కూడలి దగ్గర ఆగిపోయింది. ఏదో టిక్కట్లు ఇవ్వడంలో జరుగుతున్న ఆలస్యం అనుకున్నాడు కానీ, ఆ బస్సుకు ముందు నాలుగైదు బస్సులూ, వెనుక కొన్ని బస్సులూ ఆగిపోవటంతో ఏదో కథ ఉందని ఊహించక తప్పలేదు. ఏముందీ ఏదో బందో, నిరసన ప్రకటనో జరుగుతున్నట్టుంది దారిలో అనుకుని నిట్టూర్చాడు. అత్యవసరాలకు ఉపయోగపడే కాజువల్ శెలవలు ఎప్పుడో ఖర్చయిపోయాయి.

ఆఫీసుకు వేళకు రావాలని హడావిడిగా బస్సు కోసం ఉదయాన్నే వచ్చాడు. బస్సు దొరికింది, కిటికీ ప్రక్కనే కూర్చుందుకు సీటూ దొరికిందని తృప్తి పడ్డాడు. అలాంటి అదృష్టం ఎప్పుడోకానీ దొరకదు. కిటకిటలాడే బస్సులో నిలబడి ప్రయాణించడమే తనకు ఎదురయ్యే అనుభవం. బస్సు దొరకడమే అదృష్టమని తృప్తిపడే మనస్తత్వం తనది.

బస్సులెందుకు ముందుకు పోవడంలేదో ఇంకా అర్థంకాలేదు. విసుగ్గా కిటికీలోంచి రోడ్డు ప్రక్కనే ఉన్న చిన్న టెంటులోకి చూశాడు. గట్టిగా ఎండకాస్తే కాసింత చిరుగుల గొడుగులా అందులో ఉన్న చిన్న కుటుంబాన్ని నీడనిచ్చి ఆదుకుంటుంది. అంతకు మించిన రక్షణ ఇవ్వలేదు. ఆ ఆవాసానికి ప్రహరీ గోడలు లేవు. ఏ లారీ డ్రైవరయినా బాగా త్రాగి నిర్లక్ష్యంగా నడుపుతే ఆ టెంటూ అందులో ఉన్న కుటుంబ సభ్యులూ ఆనవాలుకైనా కనపడరు. కానీ వాళ్ళకి అలాంటి భయం ఏదీ ఉన్నట్లు లేదు. వాళ్ళ దీక్షలో వాళ్ళున్నారు. చేతినిండా గాజులు తొడుక్కొని అద్దాలు పొదిగిన రంగుల దుస్తుల్లో ఆ ఇల్లాలు బాగా కాలిన ఇనుప కమ్మీని పట్టుకారుతో బలంగా పట్టుకుని కూర్చుని ఉంది. ఆమె భర్త అయి ఉంటాడు, బలిష్టమైన చేతులు పైకెత్తి పెద్ద సుత్తితో ఆ కాలిన కమ్మీని ఎంతో ఏకాగ్రతతో గురితప్పకుండా కొట్టి కొసను సాగగొడుతున్నాడు. ఆ ఉమ్మడి శ్రమలో ఏ మాత్రం అజాగ్రత్త చూపినా అది అపాయకరంగా పరిణమించే కాయకష్టం వాళ్ళది. ఆ కుటుంబానికి ఆ కాయకష్టమే జీవనాధారం అని జీర్ణదశలో ఉన్న ఆ టెంటు చెబుతోంది. చేతిలో ఉన్న

పనిని మధ్యలో ఆపిందా ఇల్లాలు. పిల్లల మీద ఉన్న బాధ్యత గుర్తువచ్చినట్టుంది. రెండేళ్ళయినా నిండని చిన్నపిల్ల చేతికి ఒక రొట్టె ముక్కను అందించింది. ఉయ్యాలలో ఉన్న పిల్లవాడికి పాలిచ్చి, వాడిని తన కూతురుకి ఎదురుగా కూర్చోబెట్టి రొట్టెముక్కను తింటున్న ఆ పిల్లతో ఏదో అన్నది.

కదలకుండా ఉన్న బస్సులోని జనం అసహనంగా ఉన్నారని వాళ్లు ముట్టించి విడిచి పెడుతున్న సిగరెట్టు పొగ చెబుతోంది. బస్సులు నడవ్వని తెలిస్తే ఇంట్లోనే చతుర్ముఖ పారాయణం చదివే వాళ్లం కదా అని విచారిస్తున్నారు కొందరు. సిటీలోని గొడవల గురించి ఊహాగానాలు చేస్తూ గట్టిగా మాట్లాడుకుంటున్నారు కొందరు. హుస్సేన్ సాగర్‌లో ఎవరిదో శవం తేలిందట. అది గుర్తుపట్టడం కష్టంగా ఉందట. అలాంటి వార్త అసాధారణమైనదేమీ కాదు కానీ, ఎవరో పెద్ద మనిషి దాన్ని చూసి అది ఒక మాజీ శాసనసభ్యుడిదని అనుమానాన్ని వ్యక్తం చేశాడట. దాంతో గొడవలు మొదలయ్యాయట. అతనేపార్టీవాడని ఎవరో ప్రశ్న లేవదీశారు. ప్రజాసేవలో కనీసం పదిపార్టీలు మారాడట. ఏ పార్టీ వాడంటే స్పష్టంగా చెప్పడం కష్టమే అంటున్నాడింకొకడు.

"ఇప్పటికింకా స్పష్టంగా శవాన్ని గుర్తు పట్టనిదే ఇంత రభస దేనికీ?" అని ధర్మ సందేహం వ్యక్తం చేస్తున్నదొక కంఠం.

"అది సహజ మరణం కాదుకదా. ఎవరో చంపినట్టుంది, అందుకే రభస" మరో కంఠం స్పష్టీకరిస్తున్నది.

ప్రతిపక్షాలను అప్రతిష్టపాలుచేసి ఓట్లు సంపాదించడానికి అధికార పక్షంవాళ్ళు చంపించారని కొందరూ, అధికారంలోని పార్టీవాళ్ళమీద ఈ హత్యానేరాన్ని రుద్ది అధికారంలోకి రావడానికి ఏదో ప్రతిపక్షం ఇలా చంపించి ఉంటుందని కొందరూ ఊహాగానాలు చేస్తున్నారు ఊరుకోలేక. ఇలా కాలం సునాయాసంగా దొర్లిపోతూ ఉంది. బస్సు కదలడంలేదు. నిరంజనం ఎక్కిన బస్సు ముందు కొన్ని బస్సులూ వెనక కొన్ని బస్సులూ ఉన్నాయి. పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లు మధ్యగా నిలిచిపోయింది. పోనీ దిగిపోదామా అంటే ఆఫీసు నడచిపోయేఅంత దూరం కాదు. చేతి రుమాలుతో మొహాన్ని గట్టిగా తుడుచుకున్నాడు. తన ఇల్లు ఆఫీసుకు దగ్గరగా ఉంటే ఎంత బావుణ్ణు అనుకున్నాడు. ఏదో సామెత జ్ఞాపకం వచ్చింది. నగరం నడిబొడ్డున ఆఫీసుకి దగ్గరగా ఇల్లు బోలెడు అద్దెపోసి తీసుకోగల సత్తావుంటే నగర పొలిమేరల్లో ఇంటిని అద్దెకు తీసుకోవడమెందుకూ అని ప్రశ్న వేసుకున్నాడు. మళ్ళా కిటికీలోంచి ఆ టెంటులోని కుటుంబాన్ని చూస్తూ కొంతసేపు కాలక్షేపం చెయ్యాలనుకున్నాడు.

రొట్టెముక్కను తింటూఉన్న రెండేళ్ళయినా నిండని చిన్నపిల్ల కెదురుగా దాని తమ్ముడు

కూర్చుని గట్టిగా తుమ్మాడు. ఆ పిల్లల తల్లీ తండ్రీ మళ్ళా వాళ్ళ కాయకష్టంతో గడ్డపారకు ములుకు సానపడుతున్నారు. జలుబుతో ఉన్న తమ్ముడు ముక్కు చెమ్మగా మూసుకుపోయి ఊపిరాడక ఏడుస్తుంటే వాడికంటే కాస్త పెద్దదయిన ఆ పసిపాప దాని చేత్తో ముక్కు తుడిచే ప్రయత్నం చేసింది. ఆ తమ్ముడు స్థిమితంగా తనలా కూర్చోలేడని దానికేం తెలుసు. వాడు కాస్తా వెనక్కు పడిపోయి కేరుమని ఏడుపు మొదలెట్టాడు.

తల్లి వచ్చి ఆ చిన్నదాన్ని వీపుమీద ఒక్కటి వేసి చంటివాణ్ణి ఎత్తుకుంది. నిరంజనానికి ఆ దృశ్యం ఎంతో బాధకలిగించింది. పాపం ఆ చిన్న పిల్ల వయస్సెంత. అది చేసిన నేరమేమిటో దానికే అర్థంకాని వయసు. తమ్ముడి ముక్కుతుడవ బోయిందే కానీ వాడు పడిపోతాడని ఎలా ఊహించగలుగుతుంది? తల్లి ఊరికే కొట్టినందుకు నిరసనగా చేతిలోని రొట్టెముక్కని గిరాటేసింది. తల్లి తమ్ముణ్ణి ఉయ్యాలలో పడేసి తన పనిలో మునిగిపోయింది. ఇప్పుడు తను చూసిన దృశ్యం నిరంజనాన్ని బాగా బాధించింది. ఆ పసిపిల్ల కొంత సేపటికి ఓదార్చేవాళ్ళులేక ఏడ్చి ఏడ్చి మెల్లగా వెళ్ళి క్రిందపడ్డ రొట్టెముక్కను దులిపి తినే ప్రయత్నం చేస్తోంది.

ఇంతలో బస్సు కదలకపోగా, ఎక్కడి నుంచో ఎదురుగా బస్సులు తిరుగుముఖం పట్టి వచ్చేస్తున్నాయి. ఏవో గొడవలు జరిగినట్టే ఉన్నాయి. అద్దాలు పగిలి బోసిపోయి క్షతగాత్రులైన సైనికుల్లా ఉన్నాయి ఆ తిరుగుముఖం పట్టిన బస్సులు. ఆఫీసులకూ కూలీనాలీ చేసుకుందుకూ బయలుదేరిన వాళ్లంతా ఇళ్లకు వచ్చేస్తున్నారు. ఎక్కడో ఏదో జరిగింది, కర్ఫ్యూ పెట్టారో ఏమో. రైలు పెట్టెకు నిప్పు పెట్టారనీ ఆ నిరసన ప్రదర్శనలో నిండు ప్రాణాలు కొన్ని బలి అయిపోయాయనీ అనుకుంటున్నారు ఆ వచ్చిన వాళ్ళంతా.

రెండేళ్ళయినా నిండని పసిపిల్ల తన తమ్ముడి జీవితమూ, తన జీవితమూ ఎంతో విలువైనదనీ జీవితానికి రొట్టెముక్క ఆధారమనీ తెలుసుకునే ప్రయత్నం చేస్తూ తాత్కాలికమైన ఉద్రేకాన్ని నియంత్రించి అదుపు చేసుకునే సాధనలో ఉంటే చదువుకున్న వాళ్ళూ వయసు పైబడ్డవాళ్ళూ లక్షలు విలువ చేసే ఆస్తుల్ని ధ్వంసం చేసుకోవడం, ప్రాణాలతో ఆటలాడుకోవడం ఎంతకూ అర్థంకాని చిక్కుప్రశ్నలా కనిపించింది.

అవలీలగా అంతరిక్షయానం చెయ్యడం నేర్చుకున్న ఆధునికుడు తన ఆవేశాన్ని కాస్త అదుపు చేసుకొని, తన నిరసన ప్రకటనకు సున్నితమైన మార్గాలు ఎందుకు కనిపెట్టలేకపోతున్నాడో అని తనలో ప్రశ్న వేసుకుని గాఢంగా నిట్టూర్చాడు నిరంజనం.

(జాగృతి దీపావళి ప్రత్యేక పంచిక 1994)